క్లుప్తంగా

పౌష్టికాహారం తీసుకోవాలి

వాగలమర్రి: గర్భిణులు, బాలింతలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ సూచించారు. ప్రభుత్వం ఈ నెల 1 నుంచి 30వ తేది వరకు నిర్వహిస్తున్న పౌష్టికా హారోత్సవాల్లోభాగంగా గురువారం కుమ్మరి కట్ట వీధిలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో 6,12,14 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన సుమారు 50 మంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సును కార్యకర్తలు రజిని, అనురాధ, ఇందుమతి నిర్వహించారు.

ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలి

గోస్పాడు: అసైన్డ్ భూములను అమ్ముకోవచ్చనే ప్రభుత్వ ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని దళిత సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షుడు కృష్ణ కోరారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

దొర్నిపాడు: నాలుగు దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు, తీగలకు కాలం చెల్లడంతో చిన్న పాటి గాలివాన వచ్చినా, పక్షులు తీగలపై వాటినా విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. ఇలా కొన్నేళ్లుగా మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం కాలనీలో నూతన స్తంభాలు, తీగలను ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. లైన్‌మెన్ నాగన్న, సర్పంచ్ శివరామిరెడ్డి పనులను పర్యవేక్షించారు.

2,118 హెక్టార్లలో ఈ-పంట నమోదు

నంద్యాల(అర్బన్): మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ కింద సాగు చేసిన 2,118 హెక్టార్లలో ఈ-పంట నమోదు పూర్తయ్యిందని ఏఓ ప్రసాదరావు తెలిపారు. 7,665 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం కాగా.. ఇప్పటికవరకు 4,057 హెక్టార్లలో వరి, మొక్కజొన్న, మినుము, మిరప, పత్తి పంటలు సాగయ్యాయన్నారు. మండలంలోని చాపిరేవుల, పాండురంగాపురం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం ఆయా గ్రామాల వీపీఏలతో ఈ-పంట నమోదు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చెంచుల అభివృద్ధికి చర్యలు



చెంచులతో మాట్లాడుతున్న అధికారులు

రుద్రవరం: చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రవీంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆలమూరు తిప్పను ట్రైబల్ వేల్ఫేర్ కమిషనరేట్ పోగ్రాం అధికారులు మధుసూదన్‌రావు, కమ్రుద్దీన్‌ను చెంచుల స్థితిగతులను పరిశీలించారు. ఆరోగ్యశ్రీ కార్డులు, జాబ్‌కార్డులు, విద్యుత్ స్తంభాలు, సాగు చేసుకొనుటకు భూములు, ఆధార్, రేషన్ కార్డులు, సీసీరోడ్లు అర్హులందరికీ ఇవ్వాలని గిరిజనులు కోరారు. అనంతరం హరినగరం చెంచుగూడెంను సందర్శించారు.


తాటిచెట్లు దగ్ధం

రుద్రవరం: మండలంలోని నర్సాపురం పంట పొలాల్లో గురువారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో తాటిచెట్లు దగ్ధమయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. నర్సాపురం నుంచి అహోబిలం వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న తాటిచెట్లకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని తాటిచెట్ల పొడవునా మంటలు వ్యాపించడంతో అహోబిలం వెళ్లే భక్తులు భయాందోళన చెందారు.

నూతన కమిటీ ఎన్నిక

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా శ్రీగణేష్ మహోత్సవ గౌరవ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక కార్యక్రమం కర్నూలు జిల్లా సమన్వయ కార్యదర్శి నాగఫణి శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించారు. జిల్లా సమన్వయకర్త నాగఫణి శాస్త్రి మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిర్వహణ, మంటప నిర్వాహకులు అధికార యంత్రాంగం మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరించే నంద్యాల రెవెన్యూ జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేశామని చెప్పారు. గౌరవ సభ్యులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడిగా చిలుకూరి శ్రీనివాస్, కార్యదర్శిగా ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామాంజనేయులును ఎన్నుకున్నారని వివరించారు. అలాగే ప్రతి మండలం నుంచి ఉపాధ్యక్ష, కార్యదర్శి సభ్యులను ఎన్నుకున్నామన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



వెంకటరాముడును సన్మానిస్తున్న దృశ్యం

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వెంకటరాముడిని ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు అందజేసిన సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం ఉపాధ్యాయులు, హెచ్‌ఎం కలిసి సన్మానించారు. హెచ్‌ఎం కోటయ్య మాట్లాడారు. ఉపాధ్యాయులు శాస్త్రి, రవీంద్రారెడ్డి, శివశంకర్, రాజశేఖర్‌రెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల సైన్స్ టీచర్ శ్రీనివాస్‌రావును గురువారం వివేకానంద ట్రస్ట్ సభ్యులు సన్మానించారు. హెచ్‌ఎం విజయకుమార్, ట్రస్ట్ సభ్యులు కృష్ణారెడ్డి, పక్కీరయ్య, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రైవింగ్, ఆర్సీ కార్డులకు చెల్లు

- డిజిటల్ పత్రం చూపితే చాలు..
- అమలులోకి నూతన నిబంధన
- ఇప్పటి వరకు పెండింగ్‌లోఉన్న 65వేల కార్డుల జారీకి ఏర్పాట్లు
- రవాణా శాఖ సరికొత్త విధానానికి శ్రీకారం

అత్యవసర సమయంలో.. కొన్నిసార్లు అనుకోకుండా డ్రైవింగ్, వాహనాల ధ్రువ పత్రాలను వెంట తెచ్చుకోవడం మర్చిపోయి రోడ్డుపైకి వస్తుంటాం.. అదే సమయంలోనే ఆర్టీఏ, పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుంటారు.. ఇంతలో మనలో కార్డుల్లేవనే ఆందోళన మొదలవుతుంది.. ఎందుకంటే ఎంత ఫైన్ వేస్తారోనని.. ఇక నుంచి కార్డులు లేవనే బెంగ అక్కర్లేదు.. కేవలం స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. ప్రభుత్వం తెచ్చిన నూతన విధానంలో డిజిటల్ కార్డులుంటే చాలని చెబుతోంది.



ఆర్సీ కార్డు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం ఆర్టీఏ శాఖను ఆధునీకరిస్తోంది. మారుతున్న సాంకేతికత అనుగుణంగా ఇక నుంచి డిజిటల్ కార్డులు అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. దీంతో ఇక నుంచి ఆయా కార్డులకు చెల్లుచీటి పలకబోతున్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నింటా డిజిటలైజేషన్ అమలు చేస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. డ్రైవింగ్, ఆర్సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రం చూపిస్తే సరిపోతుంది. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో అయ్యాయి. దీంతో చాలా రాష్ట్రాల్లో కార్డులు తొలగించి డిజిటల్ పత్రాలు తీసుకువచ్చారు. దీని అమలును గత నెల 25వ తేదీ నుంచి మన రాష్ట్రంలో కూడా ప్రారంభించారు. ఇప్పటి వరకు లైసెన్స్, ఆర్సీ జారీకి కార్డుకు రూ.200, పోస్టల్ చార్జీలు రూ.25 తీసుకుని పోస్టల్ ద్వారా నేరుగా ఇంటికే పంపించే వారు. అయితే కార్డులు ప్రింట్ కాకపోవడం, పోస్టల్ ఆలస్యం వంటి కారణాలతో రెండు మూడు నెలలైనా కార్డు చేతికి రాని పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటి వరకూ నంద్యాల జిల్లా వ్యాప్తంగా దాదాపు 65వేల ఆర్సీ, డ్రైవింగ్ కార్డులకు ఫీజు వసూలు చేశారు. వాటి వరకు మాత్రమే ప్రింట్ చేసి, వాహన చోదకులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా శాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఏపీఆర్టీఏసీసిటిజన్.ఈప్రగతి.ఓఆర్‌టీ నుంచి ఫారం 6 లేదా 23 డౌన్లోడ్ చేసుకుని ధ్రువపత్రం తీసుకోవాలి. లేదా ఏపీఆర్టీఏ సిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీస్ లేదా రవాణా అధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపిస్తే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఇకపై కార్డుల పంపిణీ ఉండదు



రవాణా శాఖ జారీ చేసే ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సులకు సంబంధించి ఇకపై కార్డులు పంపిణీ ఉండదు. ఇప్పటి వరకూ ఉన్న కార్డులు ప్రింట్ చేసి త్వరలో వాహన దారులకు అందజేస్తాం. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు రవాణా శాఖ యాప్ నుంచి పత్రం డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.

– శివారెడ్డి, జిల్లా రవాణా అధికారి, నంద్యాల

ఫిష్ ఆంధ్రాకు ప్రోత్సాహం

శిరివెళ్ల: ఫిష్ ఆంధ్రాకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు మత్స్యశాఖ జిల్లా ఏడీ సంధ్యారాణి తెలిపారు. గురువారం పథకం రుణాలపై స్థానిక కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ రేణుకతో చర్చించారు. ఆమె మాట్లాడుతూ చేపల పెంపకం, అమ్మకాల కోసం రుణాలు ఇస్తుందన్నారు. రూ.10 లక్షల నుంచి రూ. కోటి దాకా బ్యాంక్ రుణాలు నిరుద్యోగ యువతీ యువకులకు ఇప్పిస్తామని చెప్పారు. ఎస్సీలకు 60 శాతం, ఇతరులకు 40 శాతం సబ్సిడీ ఉంటుందని పేర్కొన్నారు. ఎఫ్‌డీఓ పాపన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

శిరివెళ్ల: స్థానిక జలిజపేటలోని సాయిబాబా నగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణానికి వక్ఫ్ బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ మండల కేంద్రంలోని 4 గ్రామ సచివాలయాల పరిధిలో రూ. 80 లక్షలతో సిమెంట్ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, సర్పంచు సాలమ్మ, దాది రెడ్డితిమ్మరాయుడు,నాగరాజు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'ను విజయవంతం చేయాలి

- జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచన

గోస్పాడు: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిస్తామని, ఇందుకు జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరుకానున్నట్లు చెప్పారు. గోస్పాడు మండల ప్రజలు తమ సమస్యలను ఈ కార్యక్రమం ద్వారా ఉన్నతాధికారులకు నివేదించుకోవచ్చన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించి మండల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుర్రాల భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రారావు, ఈఓఆర్డీ అనసూయ పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

శిరివెళ్ల: వినాయక చవితి పండగ సందర్భంగా గణపతి విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీఐ చంద్రబాబునాయుడు తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శాంతి కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత సామరస్యం, శాంతియుత వాతావరణం కోసం పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. అందుకు ప్రజలు కూడా సహకరించాలన్నారు. విగ్రహాల ఏర్పాటుకు గ్రామ స్థాయిలో కూడా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పండుగ సందర్భంగా ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చూసుకోవలసిన బాధ్యత కమిటీదేనన్నారు. వేడుకల సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా రాత్రి సమయంలో మైకలు, డీజేలు పెట్టరాదని సూచించారు. రాత్రి వేళలో విగ్రహాల వద్ద కాపలా ఉండాలని, భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. నిమజ్జనం రోజున ట్రాక్టర్ డ్రైవర్లు మద్యం సేవించరాదని, రాత్రి వేళలో నిమజ్జనం చేయరాద తెలిపారు. ఎస్‌ఐ సురేష్, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, మత పెద్దలు పాల్గొన్నారు.

క్రీడలు పకడ్బందీగా నిర్వహించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే క్రీడలు పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ బ్రహ్మం నాయక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనాథ్ సూచించారు. గురువారం స్థానిక గురురాజ పాఠశాలలో 29 మండలాల స్కూల్ గేమ్స్ కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించి జిల్లాకు పేరు తీసుకురావాలని కోరారు. అండర్-14,17 బాల, బాలికలకు మండల స్థాయిలో 12వ తేదీ వరకు క్రీడా పోటీలు నిర్వహించాలని, నియోజకవర్గ స్థాయిలో 13 నుంచి 20వ తేదీ వరకు, 21 నుంచి 30వ తేదీ వరకు ఎంపిక పోటీలు జరుగుతాయని చెప్పారు. ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ల ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా 9 క్రీడాంశాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాల స్కూల్‌గేమ్స్ సెక్రటరీల ఆధ్వర్యంలో 49 క్రీడల్లో ఎంపికలు నిర్వహిస్తామని, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని సూచించారు. అన్ని పాఠశాలలకు చెందిన యాజమాన్యాలకు చెందిన విద్యార్థులు ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హులని స్పష్టం చేశారు. విద్యార్థుల వివరాలతో ఎండీఎం అక్విటెన్స్ ఫాం సమర్పించాలన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు జిల్లాస్థాయి ఎంపికకు అర్హులన్నారు. సమావేశంలో ఏపీరెడ్డి, ధోరతి, దేవానందన్, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, సుధాకర్, నాగరాజు, గోపినాయక్, శంకర్, కృష్ణ పాల్గొన్నారు.

విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించిందన్నారు. అలాగే రూ.475కోట్లు వ్యయంతో నంద్యాలలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి వైద్యాన్ని పేదలకు మరింత దగ్గర చేసిందని చెప్పారు. గురువారం పట్టణంలోని 8వ వార్డులో కౌన్సిలర్ తౌహిద్, వార్డు ఇన్‌చార్జ్ నిజాంఖాన్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి లబ్ధిపొందిన పథకాలను వివరించి పాలన, పథకాల అమలులో గత ప్రభుత్వాలతో పోల్చుకోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ గతంలో పథకాలు కొందరికే అందేవని, కానీ.. జగనన్న పాలనలో అర్హులందరికీ అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, నాయకులు గన్నీ షేక్‌షా, అమీన్, హుసేన్‌సా, రియాజ్, సలీం, రషీద్, మహేష్, ఆదినారాయణ, ఖాసీం, ఫారూక్, ఆర్టీసీ వలి, రసూల్, షఫీ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'పై అవగాహన కల్పించండి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

నంద్యాల: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రవేశపెడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కారదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. గురువారంసంబంధిత కార్యదర్శులతో కలిసి ఏపీ సెక్రటేరియట్ నుంచి వర్చువల్ విధానంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రామవార్డు సచివాలయాల సేవలు, ఐసీడీఎస్ పథకాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జేసీ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లాధికారులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రగతిలో వంద శాతం ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని లైన్ డిపార్టుమెంట్ల అధికారులందరూ సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 11 గ్రామాల్లో నీరు కలుషితమవుతున్నట్లు సర్వేలో వెల్లడైందని జిల్లా పంచాయతీ అధికారి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, వైద్యాధికారులు సమన్వయం చేసుకొని అతిసారా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మండల స్థాయిలో 'జగనన్నకు చెబుదాం'

ప్రజా ఫిర్యాదులకు మెరుగైన పరిష్కారం కోసం మండల స్థాయిలో ఈనెల 8న గోస్పాడులో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు అన్ని మండల కేంద్రాల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఇకపై ప్రతి బుధవారం, శుక్రవారాల్లో మండల కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 8వ తేదీ గోస్పాడు, 13న శిరివెళ్ల, 15న బండిఆత్మకూరు, 20న నంద్యాల, 22న బేతంచర్ల, 27న బనగానపల్లె, 29వ తేదీ పాణ్యం మండలాల్లో స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ వివరించారు. ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలని సంబంధిత డీఎల్‌డీఓల సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలి



బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయంలో శ్రీకృష్ణ వేషధారణలోనున్న చిన్నారులతో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి



నంద్యాల: పూజల్లో పాల్గొన్న జడ్జి రాధారాణి

నంద్యాల(వ్యవసాయం): ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అనుసరించాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎన్జీఓస్ కాలనీలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం శ్రీ కృష్ణుడి వేషధారణలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు, రాధాకృష్ణుల ప్రదర్శనలు, శ్లోకాలు అలరించా యి. బ్రహ్మకుమారీలు సావిత్రి, హరిప్రియ, సరస్వతి, రామ్‌మనోహర్‌రెడ్డి,సన్నలసాయిరాంరెడ్డిపాల్గొన్నారు.

- శ్రీచైతన్య మహాప్రభు మూవ్‌మెంట్ వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాసనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను గురువారం సాయంత్రం నిర్వహించారు. శ్రీకృష్ణ బలభద్ర, సుబద్రలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు.
- పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణ మందిరంలో పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామునే శ్రీకృష్ణభగవానుడి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సామూహిక కుంకుమార్చన, తులసీ అర్చనలు చేపట్టారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ మూర్తికి గ్రామోత్సవం జరిపించారు.

శిరివెళ్ల: యర్రగుంట్ల శ్రీ రామకృష్ణా గీతామందిరంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గీతోపదేశం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు తరలి వచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

గోస్పాడు: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి, న్యాయవాది వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి విగ్రహాలను ఊరేగించారు.

దొర్నిపాడు: మండలంలో శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకొని ఉట్టిమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో స్వామివారి చిత్రపటాన్ని ఊరేగించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రుద్రవరం: మండలంలోని హరినగరం సమీపంలో నున్న ఇస్కాన్ మందిరంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాల అనంతరం పలు గ్రామాల నుంచి హాజరైన యువకులకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించి బహుమతులు అందజేశారు. ఇస్కాన్ భక్తబృందం సభ్యులతో భజనలు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీకృష్ణరాయబారం నాటకం భక్తులను అలంరించింది. భక్తులకు విందుభోజనం ఏర్పాట్లు చేశారు.

చాగలమర్రి: మండల కేంద్రంలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమిను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ భగవానుడి ఉరేగింపు కార్యక్రమాన్ని ఆశ్రమ ఆచార్యులు శ్రీఅభినవ శంకరానంద స్వామి, హిందూ సంఘం సభ్యులు ప్రారంభించారు.పాత బస్టాండు సమీపంలోని శ్రీశివరామనంద ఆశ్రమం నుంచి ప్రారంభమై, మెయిన్ బజార్ మీదుగా పెద్దమకానం, మేయిన్ బజార్, అమ్మవారిశాల నుంచి యథాస్థానానికి చేర్చారు.

ఉయ్యాలవాడ: స్థానిక కుందూనది ఒడ్డున వెలసిన శ్రీవేణుగోపాల ఆశ్రమంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి భక్తులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భగవద్గీత పారాయణం గావించారు. ఆశ్రమ నిర్వాహకులు మహానంది రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడికి ఊయల సేవ చేపట్టారు.



గోస్పాడులో ప్రత్యేక అలంకరణలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఉత్సమూర్తులు



యర్రగుంట్లలో భక్తులకు అన్నదానం



దొర్నిపాడులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



చాగలమర్రిలో ఉరేగింపును ప్రారంభిస్తున్న దృశ్యం



అహోబిలం ఇస్కాన్ మండపంలో కొలువైన రాధాకృష్ణులు,



ఉట్టి మహోత్సవం



చాగలమర్రి: ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నాడు- నేడు పనులు పూర్తి చేయండి

శిరివెళ్ల: మన బడి నాడు- నేడు రెండో విడత పనులను పూర్తి చేయాలని ఎంఈఓ శంకర్‌నాయక్ ఆదేశించారు. గురువారం నాడు- నేడు పురోగతిపై ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండవ విడత కింద మండలంలో 23 పాఠశాలలు ఎంపికయ్యాయన్నారు. అందులో 5 ఉన్నత పాఠశాలలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలుండగా.. వాటిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ. 3.80 కోట్ల మంజూరు చేసిందని, వాటితో చేపట్టిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిగా పనులు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఏంఈఓ-2 నాగార్జునరెడ్డి, సీఆర్పీలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

శిరివెళ్ల: చికిత్స పొందుతు చాకలి ఉసేని (68) మృతి చెందాడని ఎస్‌ఐ సురేష్ తెలిపారు. గత నెల 29వ తేదీన ఆళ్లగడ్డ మండలం చందలూరుకు బంధువుల వద్దకు మోటార్ సైకిల్‌పై వెళ్లి స్వగ్రామం గోస్పాడు మండలం దీబగుంట్లకు వెళ్తుండగా గోవిందపల్లె వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఉన్నత వైద్యం కోసం కర్నూల్‌కు తరలించగా అక్కడ కోలుకోలే బుధవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

రుద్రవరం:విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకోవాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఫ్రెషర్స్‌డే వేడుకలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యుక్తవయస్సులో సామాజిక మాధ్యమాలు, సినిమాల ప్రభావం వల్ల చెడు అలవాట్ల వైపు ఆకర్షితులు కావడానికి అవకాశం ఉందన్నారు. అలాంటి వాటికి దూరంగా ఉండి లక్ష్య సాధన దిశగా పయనించాలని సూచించారు.

రీసర్వేపై ప్రణాళికలు రూపొందించండి



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి

నంద్యాల: జిల్లాలో చేపట్టిన మూడవ విడత రీ-సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సర్వేయర్లను ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మూడవ విడత రీ సర్వే ప్రక్రియపై మండల, సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హరికృష్ణ, డీపీఓ మంజుల వాణి తదితరులు పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో 150 గ్రామాల్లో చేపట్టే మూడో విడత రీ సర్వేలో తొలుత 56 గ్రామాలను ఎంపిక చేసుకొని పూర్తి చేయాలని చెప్పారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో పెండింగ్ ఉన్న హద్దు రాళ్ల పాతే ప్రక్రియను నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ నిర్మల

నంద్యాల(అర్బన్): బాల్యవివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని వాటి నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మల తెలిపారు. బాల్య వివాహాలతో మాతాశిశు మరణాలు పెరగడమే కాకుండా తక్కువ బరువుగల పిల్లలు పుట్టే అవకాశం ఉందన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణశ్రీ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, డీఎల్‌డీఓ జనార్దన్, ఎంపీపీ శెట్టిప్రభాకర్, సూపర్‌వైజర్ విజయ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మదర్‌సా సైటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో శ్రీలక్ష్మి, రామారావు, నరసింహులు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు.

చెరువుకు గండి

ఉయ్యాలవాడ: మండలంలోని రూపనగుడి గ్రామ పొలిమేరలో ఉన్న చెరువుకు గురువారం గండి పడింది. దీంతో చెరువులో నీరు వృథాగా బయటకు పోతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు మాసాలు గడుస్తున్నా నాలుగు రోజుల క్రితం వరకు సరైన వర్షాలు లేక నీరులేక వెలవెలబోయింది. గత నాలుగురోజుల క్రితం కురిసిన భారీవర్షాలకు చెరువుకు నీరు వచ్చి చేరింది. వ్యవసాయ పనులకు నిమిత్తం రైతులు ఉపక్రమించిన తరుణంలో చెరువు నీరు వృథా అవుతుండంతో ఆయకట్టు రైతులు ఆందోళనకు గురువుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రూపనగుడి చెరువుకు గండి పడిన దృశ్యం